క్లుప్తంగా

బాధితురాలికి బాసట



సమీరాకు నగదు అందజేస్తున్న శ్రీను తదితరులు

పెదగంట్యాడ: కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న రాజీవ్‌నగర్‌కు చెందిన సమీరా అనే మహిళకు జేఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జాగరపు శ్రీను ఆర్థిక సాయం అందించారు. మిత్రులతో కలసి సమకూర్చిన రూ.33 వేల 200 నగదు, నెల రోజులకు సరిపడా సరకులు ఆమె కుటుంబానికి అందజేశారు.

ముగిసిన వయోజన విద్య శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: చదువుంటే ఆ కుటుంబంలో వెలుగులు ఉంటాయని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. లే పీపుల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ (లీడ్స్) ఆధ్వర్యంలో వికాస్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వయోజన విద్యపై శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవో రమ బాజీతో పాటు కార్పొరేటర్ నరసింహపాత్రుడు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో జాన్సన్, సీహెచ్ పాల్, పాస్టర్ షణ్ముఖ రవికుమార్, సురేఖ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం



ఎమ్మెల్యే నాగిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈశ్వరరావు తదితరులు

పెదగంట్యాడ: దళిత, బహుజన పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శం అని మాల మహానాడు ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు గొల్ల ఈశ్వరరావు అన్నారు. గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డిని గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం జగన్‌కే ప్రజలు మద్దతు పలుకుతారన్నారు. అనంతరం తమ సమస్యలు వివరించి, వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ టి. సుబ్బారాయుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బోనెల జోసెఫ్, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ముగిసిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డులో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా తుంగ్లాంలోని తారక రామ కళ్యాణమండపంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి విద్యార్థులు చేపట్టిన సేవాకార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రదీప్ కుమార్, ఎం.సత్యప్రకాష్, ఎన్ఎస్ఎస్ పీవో బి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు 'సంపూర్ణ పోషణ'





గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి (ఫైల్)

మాతృత్వం ప్రతీ మహిళకు ఓ వరం. గర్భం దాల్చిన దగ్గర నుంచి బిడ్డ భూమిపై అడుగిడే వరకు ఆమె కలలన్నీ ఆ చిన్నారి పైనే. పునర్జన్మ వంటి ప్రసవ వేదనను ఆ మాతృత్వపు మాధుర్యం కోసం పంటిబిగువనే భరిస్తుంది, చిరునవ్వుతో బిడ్డకు జన్మనిస్తుంది. అయితే, అమ్మ అయ్యేందుకు తగినంత శక్తి ఆమెకు లేకపోవడమే ఎన్నో ప్రాంతాల్లో మహిళల పాలిట శాపమైంది. రక్తహీనతతో గర్భిణులు ప్రసవ సమయంలో ఎన్నో సమస్యలనెదుర్కొంటున్నారు. పేదరికం కారణంగా సరైన పౌష్టికాహారం తీసుకోలేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. ఆ లోటును భర్తీ చేస్తూ.. ప్రతీ మాతృమూర్తికీ ఆ మమకారపు మాధుర్యాన్ని ఆనందంగా అందించేలా రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకమే వైఎస్సార్ సంపూర్ణపోషణ. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేయడంతో పాటు చిన్నారులకు కూడా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమతుల ఆహారాన్ని సరఫరా చేస్తోంది. ఆరోగ్యవంతమైన భావి తరాల కోసం కోట్ల రూపాయలను వెచ్చిస్తోంది. మాతా శిశువులకు రక్షణగా నిలుస్తోంది.

- ఆరోగ్యవంతమైన భావితరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకం
- గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం
- 'టేక్ హోమ్ రేషన్'పై సర్వత్రా హర్షం

గాజువాక: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకం వైఎస్సార్ సంపూర్ణ పోషణ. ఆరోగ్యవంతమైన భావితరాల కోసం టేక్ హోమ్ రేషన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం గాజువాక నియోజకవర్గంలో ఐదేళ్లలో రూ.4.71 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. పేదరికంతో గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో రక్తహీనతకు గురవుతున్నారు. వారికి పుట్టిన బిడ్డలు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం అదనపు పౌష్టికాహారం అందించాలని నిర్ణయించింది. అందులో భాగంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. గర్భిణులకు గతంలో ఇచ్చే పప్పు, పాలు, గుడ్లకు అదనంగా మరో ఆరు రకాల పోషక పదార్థాలను అందిస్తోంది. దీంతో వారిలో రక్తహీనత తగ్గి ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తున్నారు. మాతా శిశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

పిల్లల ఆరోగ్యం కోసం

ఏడు నెలల నుంచి మూడేళ్ల వయసు గల పిల్లలకు నెలకు..

1. రెండున్నర కిలోల బాలామృతం
2. రెండున్నర లీటర్ల పాలు
3. 25 కోడిగుడ్లు

వీటిని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం సమకూర్చుతోంది. మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని వంట చేసి పిల్లలకు వడ్డిస్తోంది.

వైఎస్సార్ పోషణ లబ్ధిదారులు

సంవత్సరం	లబ్ధిదారులు	సరకుల విలువ
2019-20	3178	రూ. 86,63,136
2020-21	3389	రూ. 90,99,285
2021-22	3540	రూ. 95,93,249
2022-23	3717	రూ. 96,47,007
2023-24	3908	రూ. 1,01,43,000
ఐదేళ్లలో లబ్ధిదారులకు అందజేసిన సరకుల విలువ		రూ. 4,71,45,677

వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరకులు

గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం సరఫరా చేస్తున్న సంపూర్ణ పోషణ కిట్

- రెండు కిలోల రాగిపిండి
- కిలో అటుకులు
- పావుకిలో వేరుశనగ చక్కి
- కిలో జొన్నపిండి
- పావు కిలో బెల్లం
- పావు కిలో ఎండు ఖర్జూరం.
- 3 కిలోల బియ్యం
- అరకిలో వంట నూనె
- కిలో పప్పు
- 5 లీటర్ల పాలు
- 25 కోడిగుడ్లు

పై సరకులతో కూడిన కిట్లను ప్రభుత్వం అందజేస్తోంది. వీటన్నింటిని ప్రతినెలా నేరుగా డ్రై రేషన్‌గా సరఫరా చేస్తోంది.



గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న డ్రై రేషన్ కిట్

మెనూ ఇలా..

చిన్న పిల్లలకు సోమవారం, గురువారాల్లో పౌష్టికాహారం, కూరగాయల కూర, సాంబారు, కోడిగుడ్డు కూర, వంద మి.లీ. పాలు, మంగళవారం, శుక్రవారాల్లో పౌష్టికాహారం, పప్పు, తోటకూర, కోడిగుడ్డు, 100 ఎంఎల్ పాలు, బుధ, శనివారాల్లో పౌష్టికాహారం, వెజిటబుల్ రైస్, పులిహోర, గోంగూర కూర, కోడిగుడ్డు, 100 ఎంఎల్ పాలతో కూడిన మెనూను అమలు చేస్తున్నారు.

మా పాప బరువు పెరిగింది



మా పాప సాధారణమైన బరువుతో పుట్టింది. అప్పుడు పాప బరువు 3.1 కేజీలు. అయితే, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం, బాలామృతం, పాలు తదితర బలవర్థక పదార్థాల వల్ల ఎనిమిది నెలల కాలంలో 10.7 కేజీలకు బరువు పెరగడంతో పాటు పూర్తి ఆరోగ్యంగా ఉంది. పౌష్టికాహారం అందిస్తున్న ప్రభుత్వానికి మాలాంటి తల్లుల తరఫున ధన్యవాదాలు.

– పడాల ఊర్మిళ, గాజువాక

క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటున్నా..



గర్భిణిగా మూడో నెల నుంచి మాకు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషణ పథకం కింద పౌష్టికాహారం తీసుకుంటున్నాను. నాకు ఇప్పుడు ఏడో నెల. ప్రతీ నెలా చెకప్‌కు వెళ్లినప్పుడు ఆరోగ్యంగా ఉన్నానని డాక్టర్లు చెబుతున్నారు. ప్రభుత్వం నాణ్యమైన ఆహారం సరఫరా చేస్తోంది. ప్రతీ నెలా క్రమం తప్పకుండా ఆ పౌష్టికాహారం తీసుకుంటూ, వాటిని వాడుతూ ఉండడం వల్ల ఆరోగ్యంగా ఉన్నాను.

–కింజంగి దేవి, వడ్లపూడి (ఈర్లవానిపాలెం)

నగరంలో పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యం



పార్కుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

- మేయర్ గొలగాని హరివెంకట కుమారి
- 87వ వార్డులో రూ.50.70 లక్షలతో పార్కుల అభివృద్ధికి శంకుస్థాపన

కూర్మన్నపాలెం: ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు నగర పరిధిలో ఉన్న వివిధ పార్కులను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నామని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డులోని అమరావతి మదర్ థెరిసా వాకర్స్ పార్కు, మహాత్మాగాంధీ పార్కు, తిరుమల నగర్‌లోని చిల్డ్రన్స్ పార్కుల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందుతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విశాఖ నగరాన్ని ఇప్పటికే ఎంతో అభివృద్ధి చేశామన్నారు. 87వ వార్డులో సుమారు 50.70 లక్షల వ్యయంతో పార్కులతో పాటు సీసీ డ్రైనేజీలు, కల్వర్టుల వంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేయించి, పార్కులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాకలో ప్రతీ వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, కార్పొరేటర్ బొండా జగన్నాథం, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, గాజువాక మండలాధ్యక్షుడు బొడ్డ గోవింద్, జేసీఎస్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, నాగభూషణం, శివారెడ్డి, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



చందును అభినందిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక క్రిస్టియన్ అండ్ పాస్టర్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. భెల్ టౌన్ షిప్‌లో జరిగిన ఎన్నిక ప్రక్రియకు వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి డేవిడ్ కింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షుడిగా సుధీర్ కే మహంతి, గౌరవ సలహాదారులుగా డి.ఎస్.ఎస్.రాజు, అధ్యక్షుడిగా కేత అప్పారావు (పీటర్), కోశాధికారిగా నెపోలియన్, సహాయ కార్యదర్శిగా కేత సుధాకర్ ఎన్నికైనట్లు ప్రకటించారు. ఎన్నికైన వారికి చందు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్రిస్టియన్ సంఘ పెద్దలు ఇమ్మాన్యుయేల్ మాను, సాల్మన్ రాజు, అరుణ్ కుమార్, పాల్ డేవిడ్, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులను దెబ్బ తీసేందుకే ప్రైవేటీకరణ'



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మిక శక్తిని పూర్తిగా దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కుట్రలు పన్నుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1106వ రోజు, గురువారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మ్యాజిక్ మంత్ర

- ఇంద్రజాలంతో అలరిస్తున్న విజయ కుమార్
- 3 వేల ప్రదర్శనలతో గుర్తింపు



ట్రాన్స్‌పరెంట్ షీట్ నుంచి బొకే సృష్టించడం..



ప్రదర్శనలో సృష్టించిన మామిడి కాయలను చూపుతున్న విజయకుమార్

ఉక్కునగరం: అబ్రకదబ్ర మంత్రం వేయగానే చేతిలో ఉన్న రుమాలు చేతి కర్రగా మారుతుంది, రూపాయి నాణెంపై మంత్రం వేయగా అది రెండు రూపాయి నాణాలు, యాభై పైసలు, పావలా నాణాలు ప్రత్యక్ష మవుతాయి ఇలాంటి అద్భుతాలు చాలా మంది చేస్తుంటారు. కాని ఒక వ్యక్తి అప్పుడే నాటిన మొక్కకు కాయలు కాసేలా చేస్తున్నారు. టేబుల్‌పై మొక్కను ఉంచి నీరు పోసి, దానిపై వస్త్రం కప్పి మంత్రం వేస్తారు. ఆ వస్త్రం తీయగానే చెట్టుకు మామిడి పూత కనిపిస్తుంది. మరలా వస్త్రం వేసి మంత్రం జపిస్తారు. ఈసారి దానికి మామిడి కాయలు కనిపిస్తాయి. ఈ విచిత్రం చేసేదెవరా అనే ఆసక్తి కలుగుతుందా..ఆయనే ఉక్కు విజయకుమార్.

ఇమాం సాహెబ్ స్ఫూర్తితో..

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు చెందిన విజయ్ కుమార్ మూడో తరగతి చదువుతున్న సమయంలో వీధి ప్రదర్శనలు చేస్తున్న ఇమాం సాహెబ్‌ను చూసి స్ఫూర్తి పొందారు. మామిడి మొక్కకు కాయలు కాయడం ప్రదర్శనను ఆయన నుంచే నేర్చుకున్నారు. రెండ్రోజుల్లోనే దానిని ప్రదర్శించి ఆయన ఆశీర్వాదం పొందారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా సుమారు 3వేల ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు అందుకున్నారు. అనేక పోటీలో పాల్గొని అవార్డులు గెలుపొందారు. 2023లో నెల్లూరులో జరిగిన జాతీయ మ్యాజిక్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. గత వారం చెన్నైలో జరిగిన మేజికా-2024 సదస్సులో వరల్డ్ రికార్డు కోసం ప్రదర్శన అందించి ప్రత్యేక మెడల్ గెలుపొందారు.

సేవా కార్యక్రమాలకు చేయూత..

స్టీల్‌ప్లాంట్ ఎలక్ట్రికల్ రిపేర్ షాప్‌లో విధులు నిర్వహిస్తూ, ఖాళీ సమయాల్లో ఇచ్చే ఇంద్రజాల ప్రదర్శన ద్వారా వచ్చే పారితోషికాన్ని సమాజహితానికే ఖర్చు చేస్తున్నారు విజయ్‌కుమార్. వరదబాధితులు, దివ్యాంగులు, ఎయిడ్స్ బాధితుల సహాయార్థం ప్రదర్శనలు ఇస్తూ తన వంతు సేవ చేస్తున్నారు. ఆయన ప్రతి నెలా తనకు వచ్చే జీతంలో కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చించడం విశేషం.

మ్యాజిక్‌పై అపోహలు పోవాలి

ఇంద్రజాలంపై ప్రజలకు చాలా అపోహలు, అనుమానాలు ఉన్నాయి. చిన్నప్పుడు నన్ను మంత్రగాడిగా చూసేవారు. స్థానికులు అనుమానంతో దూరం జరిగేవారు. నాతో మాట్లాడటానికి భయపడేవారు. అలాంటి వారికి ఇవి మంత్రాలు కావని, హస్తలాఘవం ద్వారా చేసే కనికట్టేనని తెలియజేయాలనేదే నా ప్రయత్నం. బి.వి.పట్టాభి రాం వల్ల రాష్ట్రంలో మ్యాజిక్‌కు మంచి రోజులు వచ్చాయి. ఆయన స్ఫూర్తితో ఇప్పుడు ప్రతీ వెయ్యి మందిలో ఒకరు మ్యాజిక్‌ను అభ్యసిస్తున్నారు. – విజయకుమార్

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

74వ వార్డులోని శిబిరంలో 515మందికి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది



రోగిని పరీక్షించి మందులు రాస్తున్న యూపీహెచ్‌సీ వైద్యాధికారి మానస

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దళ్లివానిపాలెం సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 515 మందికి వైద్యులు సేవలందించారు. ఈ సందర్భంగా సిద్ధేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి మానస మాట్లాడుతూ ప్రజలకు చేరువలోనే వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ మానసతో పాటు జనరల్ డాక్టర్ చైతన్యవర్మ, డాక్టర్ మహలక్ష్మి రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి సిబ్బంది రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మూడు కుటుంబాలకు సరకుల వితరణ



సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ మూడు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందించింది. ట్రస్ట్ ద్వారా పింఛన్ పొందుతూ మృతి చెందిన రాజాన తాతారావు కుటుంబానికి అంతిమ సంస్కారాల నిమిత్తం రూ.2వేల నగదు, నిత్యావసర సరకులు అందించింది. అలాగే, కొండయ్యవలసకు చెందిన రెడ్డిపల్లి దేముడమ్మ, పెదమడకకు చెందిన గుదే అప్పన్న కుటుంబాలకు కూడా నెలకు సరిపడా సరకులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఐఆర్‌సీహెచ్ అప్పారావు, ట్రస్ట్ ప్రతినిధులు పట్టారామ అప్పారావు, ఎం.మస్తాన్‌రెడ్డి, గుదే సుశీలా గజేంద్రరావు, జామి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న త్రిమూర్తులు

గాజువాక: రాష్ట్ర మత్స్యకార శాఖమంత్రి సీదిరి అప్పలరాజు జన్మదినాన్ని గాజువాకలో ఆయన అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాగణపతి యువజ న సేవా సంఘం అధ్యక్షుడు బచ్చట త్రిమూర్తు లు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసిన అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నర్సింగరావు, కె.కోటి, సీహెచ్.నర్సింహరావు, కన్నా, శరగడం త్రిమూర్తులు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం



సాయినాథుడికి స్వర్ణ కిరీటాన్ని అలంకరిస్తున్న జీవీ తదితరులు

గాజువాక: స్థానిక శ్రామికనగర్‌లోని షిర్డీ సాయి ఆలయ 27వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), పద్మ దంపతులు స్వామివారిని దర్శించుకుని, సాయిబాబాకు స్వర్ణ కిరీటాన్ని బహూకరించారు.వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీలేఖ శ్రీనివాస్, పోర్టు కాంట్రాక్టర్ వంద్రవాడ చంటి, ఆలయ ట్రస్టీ ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెం హైస్కూల్‌ను సందర్శించిన ఎల్ఐపీ బృందం



ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న బృంద ప్రతినిధులు

అగనంపూడి: లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎల్ఐపీ) రాష్ట్ర బృందం గురువారం పరిశీలించింది. పాఠశాలలో ఎల్ఐపీ అమలు తీరును బృంద ప్రతినిధులు పరిశీలించారు. బోధనా విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు అమలు జరుగుతున్న ఎల్ఈపీ కార్యక్రమంపై అలక్ష్యం, అశ్రద్ధ వహించవద్దని సూచించారు. అనంతరం కార్యక్రమ నిర్వహణపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. కార్యక్రమంలో బృంద ప్రతినిధులు వై.వెంకట్‌రెడ్డి, అనకాపల్లి జిల్లా ఎస్ఎస్ఏ అకడమిక్ మానిటరింగ్ అధికారి మురళీ మోహన్ పట్నాయక్, పరవాడ మండల విద్యాశాఖాధికారి దివాకర్ రావు, పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి అనుమానాస్పద మృతి



మృతుడు ప్రసాదరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి గురువారం అనుమానాస్పదంగా మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ క్యూఏటీడీ విభాగంలో ఫోర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న పరవాడ ప్రసాదరావు (45) టౌన్‌షిప్‌లో సెక్టార్-10 క్వార్టర్స్‌లో కుటుంబంతో నివసిస్తున్నారు. మధ్యాహ్నం స్థానిక కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న తమ పిల్లలను స్కూల్ నుంచి ఇంటికి తీసుకువచ్చారు. ఇంట్లోకి వెళ్లిన కొద్దిసేపటికి కుటుంబీకులు చూడగా అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే ఉక్కు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని మెడపై ఉన్న గాట్లను బట్టి మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.పోలీసులు ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించనున్నామని తెలిపారు.